క్లుప్తంగా

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

24వ వార్డులో అన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, మురళీకృష్ణారెడ్డి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో కేఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం జరిగింది. ట్రస్ట్ అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ప్రారంభించారు. భవానీ మాలధారులకు ఆమె అన్నప్రసాదం వడ్డించి మాట్లాడారు. ప్రతి వారం ఇక్కడ అన్నదానం చేయడం గొప్ప విషయమన్నారు. ట్రస్ట్ నిర్వాహకులను కార్పొరేటర్ అభినందించారు. మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇక్కడ ప్రతి శుక్రవారం 108 మందికి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులు, ప్రజల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్ట్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

బావిలో పడిన మతిస్థిమితం లేని వ్యక్తి

మద్రిపాలెం: మానసిక స్థితి సరిగ్గా లేని ఓ వ్యక్తి ఇంటి వెనకాల సుమారు 60 అడుగుల లోతు ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. దానిలో నీరు లేకపోవడంతో సురక్షితంగా బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. 50వ వార్డు మాధవధార జంక్షన్ వద్ద 48 బస్‌స్టాప్‌కు సమీపంలో మానసిక వ్యాధితో బాధపడుతున్న చిట్టినేని చైతన్య అనే వ్యక్తి తల్లిదండ్రులు బసవయ్య, పార్వతీదేవితో కలిసి నివసిస్తున్నాడు. తండ్రి బసవయ్య రిటైర్డ్ డాక్‌యార్డ్ ఉద్యోగి. చైతన్యతోపాటు తండ్రి కూడా మానసిక వ్యాధితో బాధపడుతున్నారు. తల్లి ఇద్దరినీ చూసుకుంటూ ఉంటుంది. వీరికి మరో కుమారుడు ఉన్నాడు. శుక్రవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో చైతన్య ప్రమాదవశాత్తు బావిలో పడిపోవడాన్ని గమనించిన ఆమె వెంటనే 100కు డయల్ చేసి సమాచారం అందించారు. తక్షణం స్పందించిన కంచరపాలెం పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితోపాటు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని బావిలో పడిపోయిన చైతన్యను ఓ తాడు సహాయంతో నెమ్మదిగా బయటకు తీసు ప్రథమ చికిత్స అందించారు. ఈ విషయమై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

గాయత్రీదేవికి కుంకుమ పూజలు



గాయత్రీదేవికి పూజలు చేస్తున్న భవానీ మాలధారులు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా బాపూజీనగర్‌లోని జైసంతోషిమాత ఆలయంలో దుర్గాదేవిని గాయత్రీదేవిగా అలంకరించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎడ్ల శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రధాన అర్చకుడు సూర్య ప్రకాష్‌శర్మ, భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భవానీ మాలధారులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక వైభవం.. సేవా సౌరభం

30వ వసంతంలోకి రైల్వే న్యూకాలనీ ధ్యాన మందిరం

- ఘనంగా ప్రారంభమైన వేడుకలు
- దసరా వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- షిర్డీసాయి దర్శనానికి నగరం నలుమూలల నుంచి తరలివస్తున్న భక్తులు



వండుతున్నట్టుండే బాబా ప్రతిమ



మందిరంలో ప్రత్యేక నల్లరాతి విగ్రహం



రైల్వే న్యూకాలనీలో వార్షికోత్సవానికి ముస్తాబైన షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం

తాటిచెట్లపాలెం: ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలతో రైల్వే న్యూకాలనీ షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం విరాజిల్లుతోంది. 1994లో దసరా రోజున ధ్యాన మందిర నిర్మాణం, బాబా విగ్రహ ప్రతిష్ఠ జరిగాయి. నాడు చిన్నదిగా ప్రారంభమై.. నేడు దినదినాభివృద్ధి చెందుతూ 30వ వసంతంలోకి అడుగుపెట్టింది. తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ పరిసర ప్రాంతాల నుంచే కాక నగరం నలుమూలల నుంచి భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. భక్తి కార్యక్రమాలతోపాటు నిత్యాన్నదానం, మాలధారులకు ప్రత్యేక అన్నదానం, ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు, చిన్నారులకు శిక్షణ శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ధ్యాన మందిర 30వ వార్షికోత్సవం, దసరా ఉత్సవాల సందర్భంగా ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు 10 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ధ్యాన మందిరం విశేషాలు

ఈ మందిరంలో ప్రతి విగ్రహానికి ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. ముఖ్యంగా బాబా వంట చేసి, వడ్డిస్తున్నట్టుండే విగ్రహం. ఇటువంటిది కేవలం షిర్డీలో మాత్రమే ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. దాని నమూనాతో ఇక్కడ దీనిని ప్రతిష్ఠించారు. మరో అరుదైన బాబా నల్లరాతి విగ్రహం. జీవకళ ఉట్టిపడేలా ఉండే మైనపు విగ్రహం. మహిళా భక్తులు పల్లకీ మోసే అవకాశం కేవలం షిర్డీలోనే ఉండేది. ఈ సేవను ఇక్కడ నిర్వాహకులు అందుబాటులోకి తీసుకొచ్చారు.

సేవా కార్యక్రమాలు

- 2009లో కేవలం 20 మందితో ప్రతి గురువారం ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం నేడు వందలాది మంది ఆకలి తీర్చే నిత్యాన్నదానంగా మారింది.
- దాతలు బహూకరించిన కమ్యూనిటీ ఫ్రిజ్‌ల సహకారంతో 24 గంటలూ ఆహారాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. దీని ద్వారా ఏ సమయంలోనైనా అవసరమైన వారు ఆహారం తీసుకుంటున్నారు.
- తరచుగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.
- సుశిక్షితులైన కళాకారిణులచే నాట్యం, యోగాల్లో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు.
- కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతి ఏడాది షిర్డీ యాత్రలకు భక్తులను తీసుకెళ్తున్నారు.

12న మహా అన్నదానం

ఈ నెల 12న సాయిబాబా 106వ మహాసమాధి(పుణ్యతిథి) సందర్భంగా భక్తుల స్వహస్తాలతో దీపారాధన, విభూది అభిషేకం చేస్తారు. 30వ వార్షికోత్సవం సందర్భంగా అదే రోజు ధ్యాన మందిరం వద్ద మహా అన్నదానం నిర్వహిస్తారు. కాశీ, హరిద్వారల నుంచి తెచ్చిన పంచముఖి రుద్రాక్షలు బాబాకు అభిషేకించిన తరువాత రుద్రాక్షలు, కంకణాలు, బాబా ఫొటో, షిర్డీ నుంచి తీసుకొచ్చిన విభూదిని భక్తులకు ఉచితంగా అందిస్తామని ధ్యాన మందిర వ్యవస్థాపకులు తెలిపారు.

దాతలు, భక్తుల సహకారంతో కార్యక్రమాలు



బాబా దయ.. దాతలు, సాయి సేవకులు, భక్తుల సహాయ సహకారాలతో ఎన్నో సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ 30 వసంతాలు పూర్తి చేసుకున్నాం. ఇటీవలే దాతలు కమ్యూనిటీ ఫ్రిజ్‌లు బహూకరించడంతో అన్ని వేళల్లో ఆహారం ఇక్కడ ఉంచి, అభాగ్యులు, బాటసారుల ఆకలి తీర్చగలుగుతున్నాం. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– నూకల శేషగిరిరావు, ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు

వార్షికోత్సవ కార్యక్రమాలు

ధ్యాన మందిర వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 12వ తేదీ శనివారం వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కుంజుర మహాగణపతి అభిషేకం, ప్రతి రోజు బాబాకు పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు, సహస్రనామార్చన, భక్తుల స్వహస్తాలతో క్షీరాభిషేకం, రుద్రాక్షల అభిషేకం, అనంతరం వస్త్రాలంకరణ, పల్లకీ సేవ, బాబా వారి గీతాలాపన(భజన) పుణ్యావచనం, పంచగవ్యం, నవగ్రహారాధన, వాస్తు పూజ, సాయినాథ హోమం వంటి కార్యక్రమాలు జరుగుతాయి. వీటితో పాటు కూర్మనాథ, శారదామాత, కుంజుర మహాగణపతి, నాగసుబ్రహ్మణ్యేశ్వర, శివలింగాలకు ఆయా రోజుల్లో భక్తుల స్వహస్తాలతో అర్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు.

నిబంధనల ప్రకారమే దసరా ఉత్సవాలు



నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులకు సూచనలిస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

- ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- నవరాత్రి వేడుకల నిర్వాహకులకు ఏసీపీ లక్ష్మణరావు హెచ్చరిక

సీతమ్మధార: పోలీసు శాఖ నిబంధనలకు అనుగుణంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను కమిటీల సభ్యులందరూ నిర్వహించాలని ఈస్ట్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి సూచించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర అతిథి గృహంలో శుక్రవారం ఉత్సవ నిర్వాహకులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్వాహకులకు ఎప్పటికప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది ద్వారా ఆదేశాలు జారీ చేస్తున్నామని తెలిపారు. చుట్టుపక్కల ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని నిర్వాహకులను కోరారు. దుర్గాదేవి మండపం వద్ద ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తక్కువ సౌండ్‌తో మైక్‌సెట్ వినియోగించాలన్నారు. ఉత్సవాల్లో డీజే, బాణసంచా వినియోగం మీద నిషేధం ఉందన్నారు. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందేనని చెప్పారు. మండపాల్లో అగ్నిమాపక శాఖ సూచించిన భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఇతర మతాల ప్రార్థనా మందిరాలకు సమీపంలో దుర్గాదేవి మండపాలు ఏర్పాటు చేసిన వారు సదరు మందిరాల నిర్వాహకులకు ఎటువంటి ఇబ్బంది కలిగించొద్దని సూచించారు. ప్రతి మండపంలోనూ ఉదయం, రాత్రి పూట విధిగా ఒక వ్యక్తి ఉండాలన్నారు. మండపంలో రాత్రి పూట మద్యం తాగే వ్యక్తులు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి మండపం వద్ద పాయింట్ బుక్ ఉండాలని, బీట్ కానిస్టేబుల్ తనిఖీలు చేస్తారన్నారు. వేడుకల చివరి రోజున అనుపు ఉత్సవం పోలీసులు సూచించిన మార్గంలోనే వెళ్లాల్సి ఉంటుందని ఏసీపీ స్పష్టం చేశారు. అనుపు ఊరేగింపులో మద్యం తాగి డ్యాన్స్‌లు చేయడం మీద నిషేధం ఉందని గుర్తు చేశారు. ఈ విషయంలో ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫోర్త్ టౌన్ సీఐ ఎస్.విజయకుమార్, ఎస్‌ఐ జి.వెంకటరావు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టు ఆస్పత్రి పీపీపీ ప్రతిపాదనతో నష్టం



పోర్టు హాస్పిటల్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: సాలగ్రామపురంలోని విశాఖపట్నం పోర్టు అథారిటీకి చెందిన పోర్టు హాస్పిటల్‌ను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో నాలుగో రోజు శుక్రవారం సీఐటీయూ నాయకుడు వి.ఎస్.పద్మనాభరాజు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం 80 పడకలతో ఉన్న పోర్టు ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో రూ.222.43 కోట్లతో అభివృద్ధి చేసి 300 పడకల హాస్పిటల్‌గా మార్చేందుకు కేంద్ర మంత్రి సోనోవాల్ లోక్‌సభలో ప్రకటించారని, వెంటనే ప్రతిపాదనను విరమించుకుని, పోర్టు సొంత నిధులతో నిర్వహించాలని కోరారు. పోర్టు ఉద్యోగుల వైద్య ఖర్చులు తగ్గించేందుకు ఈ ప్రతిపాదన చేశామని మంత్రి చెప్పడం హాస్యాస్పదమన్నారు. పోర్టుకు చెందిన సుమారు 4 వేల మంది కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబాలు, 13 వేల మంది పెన్షనర్లు, వారి కుటుంబాలు పోర్టు హాస్పిటల్ సేవలు పొందుతున్నాయని చెప్పారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిటు నాయకులు బి.జగన్, కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, నర్సింగరావు, ఈశ్వరరావు, శంకరరావు, రాఘువులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల కేటాయింపులో పారదర్శకత పాటించండి



సమావేశంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర యాత సేవా సంఘం ముఖ్య నాయకులు

తాటిచెట్లపాలెం: యాతలకు మద్యం షాపుల కేటాయింపులో పారదర్శకత పాటించాలని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. నరసింహనగర్‌లోని సంఘ అధ్యక్షుడు పిల్లి నూకరాజు నివాసంలో శుక్రవారం యాత ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ మద్యం పాలసీలో 10 శాతం షాపులను యాతలకు కేటాయించడం మంచిదేనని, దీనిలో పారదర్శకత పాటించాలన్నారు. ఎవరెవరికి ఏ షాపులు కేటాయిస్తున్నారో ఇప్పటివరకు స్పష్టత లేదని, బినామీలకు అవకాశం ఇవ్వకూడదని ప్రభుత్వాన్ని కోరారు. షాపులు పొందిన వ్యక్తులకు సంక్షేమ పథకాలు రద్దు కాకుండా చూడాలని సూచించారు. సాధారణ షాపులు కాకుండా ప్రత్యేక దుకాణాల కేటాయింపు వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి జనాభా దామాషా ప్రకారం షాపులు కేటాయించాలని సూచించారు. దరఖాస్తులు, ఫీజుల విషయంలోను యాతలకు వెసులుబాటు కల్పించాలని, వీరు ఐటీ రిటర్న్‌లు చెల్లించలేరని, ఈ ప్రక్రియలో ఎటువంటి అవరోధాలు ఎదురుకాకుండా చూడాలని కోరారు. సమావేశంలో గొడ్డి కన్నారావు, కొలుసు అచ్చిబాబు, సంపంగి మంగరాజు, దమ్ము రమణ, ఒనుం దేవుడు, నెల్లి దేముడు, నెల్లి సోమేష్, నకర బోయిన అప్పలనాయుడు, సిమ్మా గోవిందు, పాలికల చలం, రెడ్డి అశోక్‌కుమర్, కొలుసు సత్యారావు, పిల్లి నూకరాజు(కంచరపాలెం), రంగాల రాజు తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు’ ప్రైవేటీకరణ నిలిపేయాలి

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరాహార దీక్షకు సంప్రదాయ మత్స్యకార సంక్షేమ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. సంఘం నాయకురాలు లక్ష్మి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా సెయిల్‌లో విలీనం చేయాని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా ఆశించకుండా దేశంలోనే అత్యుత్తమంగా నడుపుతున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం లేదా మూసేస్తాం అని బాధ్యతా రహితంగా మాట్లాడితే ప్రజల ఆగ్రహాన్ని చవిచూడక తప్పదని హెచ్చరించారు. ప్రొఫెసర్ సూరప్పడు, ప్రజాగాయకుడు దేవిశ్రీ, మత్స్యకార సంఘం నాయకులు ఎం.లక్ష్మి, జి.లక్ష్మి, కనకరాజు పాల్గొన్నారు.

వీరాంజనేయుడిగా వెంకన్న



వీరాంజనేయ అవతారంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవస్థానంలో దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వేంకటేశ్వర స్వామి వీరాంజనేయస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వెంకన్నకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతి రోజూ రాత్రి 7 గంటలకు స్వామికి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్నారు. ఏపీఎస్ఈబీ కాలనీ, డాక్టర్స్ కాలనీలో స్వామివారి తిరువీధి ఉత్సవం జరిగింది. ఈ నెల 5న టీపీటీ కాలనీ, 6న కేఆర్ఎం కాలనీ, 7న అభయాంజనేయ గుడి, 8న ఎంఎంటీసీ కాలనీ, 9న ఈనాడు రోడ్డు, 10న బాలయ్య శాస్త్రి లేఅవుట్, 11న హెచ్‌బీ కాలనీ, 12న సీతమ్మధార ప్రాంతాల్లో తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. దేవస్థానం అర్చకుడు రాజా స్వామి, సిబ్బంది శివ, వనజాక్షి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 15 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి రవాణాదారులతో ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ మహిళా ఎస్ఐ పి.ఆర్.బిషోయి సిబ్బందితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో శుక్రవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం, మల్కన్‌గిరికి చెందిన గోపాల్ పంగి, మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశాదు దాస్ అక్రమంగా గంజాయి రవాణా చేస్తుండటాన్ని గుర్తించారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.75 వేల విలువైన 15 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, వారిని గవర్నమెంట్ రైల్వే పోలీస్‌లకు అప్పగించారు. జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారాం కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం ఇద్దరిని కోర్టులో హాజరు పరిచారు.

గురుద్వారా సద్ సంగత్ నూతన కార్యవర్గం

సీతమ్మధార: గురుద్వారా సద్ సంగత్ కార్యవర్గ ఎన్నికలు, సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. గురుద్వారా జంక్షన్‌లోని సద్ సంగత్ ఆవరణలో జరిగిన ఎన్నికల్లో కార్యవర్గ అధ్యక్షుడిగా డాక్టర్ దిల్షాసింగ్ ఆనంద్(సాహ్ని), ఉపాధ్యక్షుడిగా బల్జీత్‌సింగ్ బక్షి, కార్యదర్శిగా రమనీత్‌సింగ్, కోశాధికారిగా గురుప్రీత్ సింగ్ గిల్ ఎన్నికయ్యారు. మరో 11 మంది కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. వీరు రెండేళ్ల పాటు కొనసాగుతారని నిర్వాహక కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ సౌత్ ఇండియా సిఖ్ మిషన్ ఇన్‌చార్జిగా కూడా తాను కొనసాగుతున్నానని తెలిపారు. గురుద్వారా సద్ సంగత్ నిర్వహణలో తమకు సహకారం అందిస్తున్న సిక్కులకు ధన్యవాదాలు తెలిపారు. సేవా కార్యక్రమాలకు తమ కమిటీ పునరంకితమవుతుందని చెప్పారు.

దుర్గమ్మ దివ్య దర్శనం శుభకరం



లలితా పీఠంలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు



సీతంపేటలో గాయత్రీదేవి అలంకరణలో పార్వతీదేవి



సీతన్న కాలనీలో గాయత్రీదేవిగా అమ్మవారు



మురళీనగర్‌లో లలితాదేవి అవతారంలో అమ్మవారు



గాంధీనగర్‌లో బాలాత్రిపుర సుందరీదేవి



రేసపువానిపాలెంలో భూలోకమాత



నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో కన్యకాపరమేశ్వరి

సీతంపేట: నియోజకవర్గంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం లలితానగర్ శ్రీలలితా పీఠంలో వేద పండితులు మహాలక్ష్మి షడక్షరీ హోమం నిర్వహించారు. చండీ పారాయణ, గోపూజ, శత చండీ పారాయణ, అమ్మ వారి సన్నిధిలో, మణిద్వీపంలో శ్రీచక్రనవావరణ, సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన, చండీ హోమం చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు పీఠంలో సుదర్శన హోమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

సీతంపేట పార్వతీశ్వరాలయంలో పార్వతీదేవి శుక్రవారం గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్ర నామార్చన, ఖడ్గమాలార్చన జరిపారు. ఆలయ అర్చకులు శివాజీశర్మ, భాస్కరశర్మ పూజలు చేశారు.

బాలాత్రిపుర సుందరిగా దుర్గాదేవి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం గాంధీనగర్‌లో లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండో రోజు దుర్గాదేవిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రధాన ఆర్గనైజర్ బండారు గుప్తాజీ పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతున్నాయి.

కన్యకాపరమేశ్వరిగా దుర్గాదేవి

జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో కొలువైన దుర్గాదేవి అమ్మవారు రెండో రోజు కన్యకాపరమేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. ప్రతి రోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. శనివారం మీనాక్షిదేవిగా అమ్మవారు దర్శనమిస్తారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేశారు. మహిళలు కుంకుమార్చనలు జరిపారు. ఆలయ అర్చకుడు రాజాస్వామి, సిబ్బంది శివ, వనజాక్షి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా భూలోకమాత

24వ వార్డు రేసపువానిపాలెంలోని భూలోకమాత అమ్మవారి ఆలయంలో గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ పెద్దలు, రేసపువానిపాలెం గ్రామ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా కనకదుర్గ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార సీతన్న కాలనీలోని కనకమహాలక్ష్మి, గాయత్రీదేవి, కనకదుర్గాదేవి ఆలయంలో రెండో రోజు శుక్రవారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేశారు. పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

లలితాదేవిగా లలితాంబికా

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో కొలువైన లలితాంబికాదేవి రెండో రోజు లలితాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు భోగాపురపు ప్రసాదశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలచే సామూహిక సహస్ర కుంకుమార్చనలు, తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 5 గంటలకు అమ్మవారి ఉత్సవ మూర్తిని ఆలయ ప్రదక్షిణ చేయించి 11 రకాల హారతులు, మంత్రపుష్పం సమర్పించారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.ఎస్.రెడ్డి, సనపల వరప్రసాద్, ఇతర సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



